సాక్షి శ్రీకాకుళం


శనివారం । 13 । జనవరి । 2024



గణతంత్ర వేడుకలు..

గణతంత్ర వేడుకలపై కలెక్టర్ సమీక్షించారు. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు.

-IIలో



3079 ఆలయాల నిర్మాణం

రాష్ట్రంలో కొత్త ఆలయాలను నిర్మిస్తున్నారు. కొత్తూరు మండలంలోని నిర్మాణాలను అధికారులు పరిశీలించారు.

-IIలో

కృష్ణావతారంలో గోవిందుడు



సారవకోట: మండలంలోని చీడిపూడి కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామిని కృష్ణావతారంలో అలంకరించారు. ఇక్కడ జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ఆలయంలోని శ్రీదేవి, భూదేవి సహిత మూల విరాట్‌ను కృష్ణావతారంలో అలంకరించి ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

20న జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష



మాట్లాడుతున్న డీఆర్వో గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జవహర్ నవోదయ విద్యా సంస్థలో ప్రవేశాల కోసం ఈనెల 20వ తేదీన జరిగే పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఆర్వో ఎం.గణపతి రావు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 7573 మంది మంది ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని, వారి కోసం జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి జిల్లావ్యాప్తంగా ఈ నెల 20న ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. సమీక్షలో జిల్లా విద్యా శాఖాధికారి వెంకటేశ్వర రావు, నవోదయ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

మకర సంక్రాంతి నాడు ఆదిత్యునికి క్షీరాభిషేకం

అరసవల్లి: మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఈ నెల 15 సోమవారం వేకువజామున 4 గంటల నుంచి అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామికి క్షీరాభిషేకం జరుగుతుందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. నిజరూప దర్శనంతో పాటు అభిషేక దర్శనం ఉన్న నేపథ్యంలో భక్తులు నేరుగా ప్రత్యేక దర్శన టిక్కెట్‌తో హాజరు కావచ్చని తెలిపారు. రూ.500 టిక్కెట్‌తో ఇద్దరిని అనుమతించనున్నామని, సోమవారం ఉదయం 4 గంటలకే ఆలయానికి రావాల్సి ఉంటుందన్నారు.

కబడ్డీ విజేత పాలకొండ

- ముగిసిన జగనన్న సంక్రాంతి సంబరాలు



పాలకొండ జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి రావికంటిపేటలో గత రెండు రోజులుగా వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న సంక్రాంతి సంబరాలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. ఈ పోటీల్లో 16 జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. 32 లీగుల్లో 8 టీమ్‌లు నాకౌట్‌కు చేరుకున్నాయి. నాకౌట్ మ్యాచుల్లో వీరఘట్టం జట్టుపై పాలకొండ, నరసన్నపేట జట్టుపై పొందూరు, బహడపల్లిపై సింగుపురం, గురవాంపై జీఎం పల్లి విజయం సాధించాయి. తదుపరి మొదటి సెమీస్‌లో సింగుపురంపై జీఎం పల్లి విజయం సాధించింది. మరో సెమీస్‌లో నరసన్నపేటపై పాలకొండ విజయం సాధించాయి. మెగా ఫైనల్స్‌లో పాలకొండ విజేతగా నిలిచింది. విజేతలకు చింతాడ రవికుమార్ చేతులమీదుగా రూ.50వేలు నగదు బహుమతిని అందజేశారు. రన్నర్‌గా నిలిచిన జీఎం పల్లి టీమ్‌కు రూ.40 వేలు నగదుతో పాటు కప్ అందజేశారు. అలాగే ముగ్గుల పోటీల్లో ప్రథమ స్థానం పొందిన కొర్లకోటకు చెదిన పేడాడ గౌతమికి రూ.10,000 నగదు బహుమతిని, ద్వితీయ స్థానంలో నిలిచిన విజేత రావికంటిపేటకు చెందిన బి.గౌతమి–టీం రూ. 5,000 నగదు బహుమతిని అందించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారికి చింతాడ రవికుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు.

ముందే పండగ తెచ్చిన పంటసిరి



- అన్నదాతల ఖాతాలకు ధాన్యం సొమ్ము
- 50,731 మందికి ఒకే రోజు అందిన సొమ్ము
- సంక్రాంతి వేళ రైతు కళ్లలో కొత్త కాంతి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అన్నదాతలకు ధాన్య లక్ష్మీకటాక్షం లభించింది. పెద్ద పండుగ వేళ.. గుండె నిండుగా ఆనందం కలిగింది. ధాన్యలక్ష్మిని ఇంటికి తెచ్చుకునే ఈ శుభ వేళ అన్నదాతల ఖాతాలకు ప్రభుత్వం ధాన్యం సొమ్ములను జమ చేసింది. తమది రైతు పక్ష పాత ప్రభుత్వమని, రైతులకు ఎప్పుడూ అండగా ఉంటుందని నిరూపించుకుంది. తమ ఖాతాల్లో ధాన్యం సొమ్ము పడటంతో అన్నదాతల కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరిస్తున్నాయి.

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతన్నల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం కింద శుక్రవారం ఒక్కరోజే రూ.463.69కోట్లు విడుదల చేసింది. తాజా చెల్లింపుతో రైతులకు రూ. 613.43కోట్లు జమ చేసినట్టు అయింది. రైతులకు మద్దతు ధర కల్పించడంతో పాటు ప్రభుత్వం వేగంగా చెల్లింపులు జరుపుతోంది. 21రోజుల్లోపు చెల్లించాలని నిర్ణయించినప్పటికీ ధాన్యం కొనుగోలు చేసిన వారం నుంచి పది రోజుల లోపే రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తోంది. కొన్ని చోట్ల మాత్రం సాంకేతిక సమస్యల వల్ల ఒకటి రెండు రోజులు ఆలస్యమైతే కావొచ్చు గానీ దాదాపు నిర్దేశించిన గడువులోగానే చెల్లింపులు చేస్తూ వస్తోంది.



రైతుకు అండగా నిలుస్తూనే...

ధాన్యం సేకరణలో తెచ్చిన ఆన్‌లైన్ విధానంతో రైతులకు పారదర్శకంగా మద్దతు ధర లభిస్తోంది. గోనె సంచులు, రవాణా చార్జీలు, హమాలీ ఖర్చులను సైతం ప్రభుత్వమే భరిస్తోంది. గత ప్రభుత్వంలో ఇవేమీ లేకపోగా రైతులకు ధాన్యం సొమ్ములను నెలల తరబడి బకాయిలు పెట్టిన సందర్భాలు ఉన్నాయి. మిల్లర్లు, దళారులకు లబ్ధి చేకూర్చేందుకు ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేసింది. ఫలితంగా రైతన్నల్లో ఆందోళన రేకెత్తించి స్థానిక మధ్యవర్తులకు ధాన్యం విక్రయించుకునేలా పరిస్థితులను సృష్టించేది. ఇలాంటి వాటిని ప్రస్తుత ప్రభుత్వం అరికడుతూ రైతులే తొలి ప్రాధాన్యంగా 21 రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ధర జమ చేయాలని ఆదేశించి అమలు చేస్తోంది. తుఫాన్ వచ్చిన సందర్భంలో కూడా రైతులకు అండగా నిలిచింది. దిగులు చెందకుండా తడిచిన ధాన్యం సైతం కొనుగోలు చేసింది. తుఫాన్ సమయంలో రైతుల సౌలభ్యం కోసం, జాప్యానికి తావివ్వకుండా ఆఫ్‌లైన్‌లో కూడా కొనుగోలు చేసి ఆపదలో అండగా నిలిచింది.

రైతులకు ఉపశమనం

పండగ వేళ ప్రతి ఒక్కరికీ ఖర్చులుంటాయి. ఈ సమయంలో సంక్రాంతికి నాలుగు రోజుల ముందు ఒకేసారి రూ.463.69కోట్లు రైతుల ఖాతాలకు ప్రభుత్వం జమ చేసింది. దీంతో రైతులు సంతోషంతో పండుగ జరుపుకోవడానికి అవకాశం వచ్చింది.

శుక్రవారం ఒక్కరోజే రూ. 463.69కోట్లు జమ..



జిల్లాలో ఈ ఏడాది 566 రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసింది. ఇప్పటి వరకు జిల్లాలో 73,339 మంది రైతుల నుంచి 3లక్షల 44వేల 252 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. వీటికి గాను రూ.751.50కోట్లు మేర చెల్లింపులు చేయాల్సి ఉండగా తొలి విడతగా 19,443మంది రైతులకు గాను 148.74కోట్లు చెల్లింపులు చేసింది. రెండో విడతగా శుక్రవారం ఒక్కరోజు 50,731మంది రైతులకు రూ.463.69కోట్లు జమ చేసింది. దీంతో ఇప్పటివరకు రూ.612.43కోట్లు జమ చేసినట్టు అయింది. ఇంకా 3168 మంది రైతులకు సంబంధించి రూ.139.07కోట్లు మేర జమ చేయాల్సి ఉంది. వీరి నుంచి గత మూడు రోజుల కాలంలో కొనుగోలు చేశారు. దీంతో వీటికి సంబంధించి సొమ్ము రావాల్సి ఉంది.

ఐదు రోజులకే..



రైతు భరోసా కేంద్రం ద్వారా నేను పండించిన 42 ధాన్యం బస్తాలను రైస్ మిల్లులకు పంపించాను. పంపించిన ఐదు రోజులకే నా బ్యాంకు ఖాతాకు రూ.74,440 జమ అయ్యాయి. ఇంత వేగంగా ధాన్యం డబ్బులు వస్తాయని అనుకోలేదు. తక్కువ రోజుల్లో ధాన్యం డబ్బులు రావడం ఎంతో సంతోషంగా ఉంది. ధాన్యం డబ్బులు అందడంతో సంక్రాంతికి ఉపయోగపడతాయి.

– బుద్దల లక్ష్మి, మహిళ రైతు ఎస్ఎస్ కాలనీ కొత్తూరు మండలం

వారం రోజుల్లో పడ్డాయి..



నాకు 60 ఏళ్లు. నేను చిన్నప్పటి నుంచి వ్యవసాయం చేస్తున్నాను. ఇంత కచ్చితంగా దళారీలు లేకుండా ధాన్యం డబ్బులు ఇంతకు ముందు ఎప్పుడూ రాలేదు. వారం రోజుల్లో నా అకౌంట్‌లో ధాన్యం డబ్బులు పడ్డాయి. రైతులు ఇప్పటికీ కొంతమంది మధ్యవర్తులను నమ్మి మోసపోతున్నారు. మిల్లర్ల వద్ద ఇబ్బంది అనేది అవకాశవాదుల ప్రచారం మాత్రమే.

– చింతు సింహాచలం, రైతు, బెలమర గ్రామం, పోలాకి మండలం

సంతోషంగా ఉంది..



ధాన్యం ఇచ్చిన మూడు రోజులకు డబ్బులు వచ్చాయి. శుక్రవారం బ్యాంకులో రూ.80 వేలు జమయ్యాయి. ప్రభుత్వానికి ధాన్యం అమ్మడంతో 80 కిలోల బస్తా దగ్గర రూ.300 లు ప్రైవేట్ వ్యాపారులు కంటే ఎక్కువే వస్తుంది. ప్రైవేట్ వ్యాపారులు బస్తా కేవలం రూ.1500కు కొనుగోలు చేస్తున్నారు. అంతే కాకుండా బస్తా ధాన్యంకు 3 కిలోలు దాటి ఎక్కువ తూకం చేస్తున్నారు. దళారీలకు అవకాశం లేకుండా నేరుగా కొనుగోలు చేసి, తక్కువ రోజుల్లోనే డబ్బులేసి ప్రభుత్వం సంక్రాంతి ముందు మమ్మల్ని సంతోషపరిచింది.

– మతం శ్రీరాములు, రైతు నీలకంఠాపురం కొత్తూరు మండలం



పాతపట్నం: మార్కెట్‌యార్డు ఆవరణలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేసిన కూరగాయలతో తీర్చిదిద్దిన ముగ్గును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



టెక్కలి : ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో దూడూ బసవన్నల సందడి



ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శివానీ కళాశాలలో విద్యార్థినుల నృత్యప్రదర్శన

వేడుకల వేళ

ఊరూవాడా వేడుక చేసుకుంటోంది. పెద్ద పండగ సమీపిస్తున్న వేళ పల్లెపల్లెనా కొత్త కళ కనిపిస్తోంది. సంక్రాంతి సందర్భంగా సంప్రదాయాలు, కొత్త పద్ధతులను కలబోస్తూ కళల ప్రదర్శనలు జరుగుతున్నాయి.

సామాజిక న్యాయమే జగనన్న అజెండా

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: సామాజిక న్యాయమే జగనన్న అజెండా అని మరోసారి నిరూపితమైందని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో పార్టీ ఇచ్ఛాపురం, టెక్కలి, నియోజకవర్గాలు, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జిలుగా నియమితులైన పిరియా విజయ, దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఇన్‌చార్జిల నియామకంలో సమన్యాయం జరిగిందన్నారు. శ్రీకాకుళం పార్లమెంట్‌తో పాటు ఇచ్ఛాపురం, టెక్కలి నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలుగా బీసీలను ప్రకటించడం గొప్ప విషయమని అన్నారు. 8 నియోజకవర్గాలతో పాటు శ్రీకాకుళం పార్లమెంట్ స్థానంలో విజయం సాధించి సీఎంకు బహుమానంగా ఇద్దామన్నారు.

ఈ సందర్భంగా పేరాడ తిలక్ మాట్లాడుతూ 75 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ నాలుగున్నరేళ్లలో జిల్లా అభివృద్ధి చెందిందని అన్నారు. ఓ కుగ్రామానికి చెందిన తనను గతంలో టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గానికి, ఇప్పుడు పార్లమెంట్ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. పార్లమెంట్ స్థానంలో అందరి సహకారంతో విజయం సాధిస్తానని అన్నారు. అలాగే ఇచ్ఛాపురం ఇన్‌చార్జి పిరియా విజయ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకంతో ఇచ్ఛాపురంలో అవకాశం ఇచ్చారని, గెలిచి సీఎం నమ్మకాన్ని నిజం చేస్తానని అన్నారు. అలాగే టెక్కలి ఇన్‌చార్జిగా నియమితులైన దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న విశ్వాసం మేరకు జిల్లాలో అన్ని సీట్లలో అఖండ విజయం సాధించి తీరుతామని అన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిరియా సాయిరాజ్, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణదాస్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్. చిత్రంలో టెక్కలి, ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జిలు దువ్వాడ శ్రీనివాస్, పిరియా విజయ, సాయిరాజ్, సూరిబాబు తదితరులు



ఆత్మీయంగా కలుసుకున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్

సులభంగా ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ నవీన్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నిరుద్యోగ యువత స్వస్థలాల నుంచే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఆయన శుక్రవారం ఉపాధి కార్యాలయం ఆన్‌లైన్ పోర్టల్‌ను employment.ap.gov.in ఆవిష్కరించారు. సంబంధిత వెబ్ పోర్టల్ ద్వారా నిరుద్యోగ యువత వారి స్వస్థలాల నుండే ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు తమ విద్యార్హతలు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఫొటో, ఇతర సర్టిఫికెట్లను పోర్టల్‌లో అప్‌లోడ్ చేసుకొని, తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. సంబంధిత జిల్లా ఉపాధి అధికారి ఆమోదం తెలిపాక ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ నంబర్ తెలుస్తుందని అన్నారు. అభ్యర్థి తన ఎంప్లాయిమెంట్ కార్డు లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి సీహెచ్ రంగయ్య, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, కె.సుధ, జిల్లా ఉపాధి అధికారి, ఏఎస్పీ విఠలేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా టెన్నీకాయిట్ జాతీయ పోటీలు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో జరుగుతున్న 47వ టెన్నీకాయిట్ జాతీయ పోటీలు నాల్గో రోజు రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీల్లో చాంపియన్ షిప్ ఫలితాల్లో పురుషుల విభాగంలో మొదటి స్థానంలో కేరళ, ద్వితీయ స్థానంలో కర్ణాటక, తృతీయ స్థానంలో తమిళనాడు, నాల్గో స్థానంలో పాండిచ్చేరి, మహిళా విభాగంలో మొదటి స్థానంలో తమిళనాడు, ద్వితీయ స్థానంలో పాండిచ్చేరి, తృతీయ స్థానంలో కేరళ, నాల్గో స్థానంలో మహారాష్ట్ర నిలిచాయి. డబుల్ ఇండివిద్యువల్ పురుషుల క్వార్టర్ ఫైనల్‌కు చేరినవారిలో కేరళ, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, వెస్ట్ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. మిక్స్‌డ్ క్వార్టర్ ఫైనల్‌కు వచ్చిన వారిలో తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ, కేరళ ఉన్నాయి.







ఊరికి పోదాం..

సంక్రాంతి ప్రయాణాలు ఊపందుకున్నాయి. విపరీతంగా వస్తున్న జనంతో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ రద్దీగా మారింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు నడుపుతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



'వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం'



పార్టీలో చేరిన వారితో కృష్ణదాస్

జలుమూరు: వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయడమే తమ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి స్వగ్రామం మర్రివలసలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి లోల లోకేశ్వరరావు, ధర్మాన అప్పారావు, సురవరపు కోటేశ్వరరావు, జెన్ని రామ్ ప్రసాద్, బగ్గు నారాయణ రావు, లుకలాపు కోటేశ్వరరావు, లుకలాపు మురళీ తదితర 15 కుటుంబాలు చేరాయి.

కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి,వైస్ ఎంపీపీ తంగి మురళీ కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బగ్గు లక్ష్మణరావు,పల్లి రమణ మూర్తి,సురవరపు సూరం న్నాయుడు తదితరులు పాల్గొన్నారు.







సుందర శ్రీకాకుళానికి శ్రీకారం

శ్రీకాకుళం నగర సుందరీకరణకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. శ్రీకాకుళం నగరాన్ని రూ.3కోట్లు ఖర్చుతో సుందర నగరంగా తీర్చిదిద్దాలని నిర్ణయించిన అధికారులు అన్ని రకాల ఆమోదాలను పొందారు. నగర ప్రవేశ ద్వారాల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, పలు రోడ్లలో సెంటర్ లైటింగ్ ఏర్పాటు, ఇప్పటికే ఉన్న సెంటర్‌లైటింగ్ స్తంభాలకు రంగుల విద్యుత్ దీపాల అమరికతో పాటు కూడళ్ల వద్ద విస్తరణ చేపట్టారు. సెంటర్ లైటింగ్ స్తంభాలకు రంగుల విద్యుత్ దీపాలను శుక్రవారం మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రారంభించారు. వీటి ఏర్పాటుకు రూ.12 లక్షలను ఖర్చు చేశారు.

-శ్రీకాకుళం

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచించారు. గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై ఆయన కలెక్టర్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ నెల 26వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వేదిక, స్టాల్స్, సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్ బీ ఎస్ఈని ఆదేశించారు. ఆడుదాం ఆంధ్రా, పరిశ్రమలు, ఆస్తుల పంపకాల శాఖలు, తదితర శాఖలు ఏర్పాటు చేయాలని, స్టాల్స్ ఏర్పాటు చేసే శాఖలు డీఆర్‌డీఏ పీడీని సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల కోసం ముందస్తుగానే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రొటోకాల్ చూసుకుని ఆహ్వానాలు పంపాలని డీఆర్‌ఓలను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించాలన్నారు.

19 నాటికి జాబితా అందించాలి..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగుల జాబితాను ఈ నెల 19వ తేదీలోగా ఫొటోలతో డీఆర్‌ఓకు అందజేయాలని సూచించారు. ఉద్యోగుల పేర్లతోపాటు వారు ఏ విధంగా ప్రశంసా పత్రానికి అర్హులో తెలియజేస్తూ వివరణ విధిగా తెలియజేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ వేదిక ఏర్పాట్లలో ఏ ఒక్కరికి ఇబ్బంది లేకుండా చూడాలని, సాంస్కృతిక కార్యక్రమాలకు ముందుగానే సిద్ధంగా ఉండాలని చెప్పారు. గణతంత్ర దినోత్సవం రోజున సరిపడే మాస్కులు అందుబాటులో ఉంచాలని ఆదేశిస్తూ కోవిడ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, పరేడ్‌పై వివరించారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, అదనపు ఎస్పీ విఠలేశ్వర రావు, ఆర్డీఓలు సీహెచ్ రంగయ్య, ఉప కలెక్టర్ పద్మావతి, డీపీఓ రవి కుమార్, డ్వామా పీడీ చిట్టిరాజు, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రసాదరావు, ఏపీసీ జయ ప్రకాష్, డీఈఓ వెంకటేశ్వర్లు, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, హౌసింగ్ పీడీ గణపతిరావు, ఆర్టీఓ గంగాధర్, ఎల్డీఎం సూర్యకిరణ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ శాంతి శ్రీ, వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్, సీపీఓ లక్ష్మీప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో జీఎస్టీ జాయింట్ కమిషనర్



జీఎస్టీ జాయింట్ కమిషనర్ సుమతికి జ్ఞాపికను అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర జీఎస్టీ జాయింట్ కమిషనర్ సుమతి శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. తొలిసారిగా అరసవల్లి క్షేత్రాన్ని దర్శించుకున్న సందర్భంగా ఆమెకు ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ, మాధవ్ శర్మ, షణ్ముఖ శర్మ, ఫణీంద్ర శర్మలు ఆమెకు వివరించారు. వేదాశీర్వచనాన్ని అందజేసి ప్రత్యేక ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో స్థానిక జిల్లా జీఎస్టీ అధికారి రాణీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయం వార్షిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయాన్ని ఎస్పీ జీఆర్ రాధిక శుక్రవారం తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయుధాలు భద్ర పరిచే గది, మోటార్ వెహికల్స్ విభాగాలు తనిఖీ చేశారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ విభాగాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ఒత్తిడి లేకుండా పనిచేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

25 నుంచి విధులకు న్యాయవాదులు హాజరు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్టును వ్యతిరేకిస్తూ న్యాయవాదులు నిరసన తెలుపుతున్నారని, అయితే ఈ నెల 25 నుంచి అందరూ విధులకు హాజరు కావాలని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు కోరారు. జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం వారు చర్చలు జరిపారు. జూనియర్ న్యాయవాదులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఈ నెల 25 నుంచి కోర్టు విధులకు హాజరు కావాలని మెజార్టీ న్యాయవాదులు తీర్మానించారని చెప్పారు.

జెడ్పీ చైర్మన్ పదవితో 'రెడ్డిక'లకు ప్రాధాన్యం



పిరియా విజయ, సాయిరాజ్ దంపతులకు కృతజ్ఞతలు చెబుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాడ నారాయణమ్మ

కంచిలి: జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని తనకు కేటాయించడంతో జిల్లాలోను, ముఖ్యంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఉన్న 'రెడ్డిక' సామాజిక వర్గానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చినట్టు అయ్యిందని ఇచ్ఛాపురం జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ అన్నారు. ఆమె తన సహచరులతో కలిసి ప్రస్తుత జెడ్పీ చైర్‌పర్సన్, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త పిరియా విజయ, ఆమె భర్త, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌ను బల్లిపుట్టుగ గ్రామంలోని వారి నివాసంలో శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవి కేటాయించడంలో కృషి చేసిన సాయిరాజ్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని తప్పనిసరిగా నిలబెడతానని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కాళ్ల దేవరాజ్, బెందాళం జయప్రకాశ్, రాంపత్ని చిట్టిబాబు, జల్లు యుగంధర్, చిడిపోతు జగన్, బదకల భాస్కర్ , ఉప్పాడ చిన్నబాబు, మోహనరావు పాల్గొన్నారు.

3079 ఆలయాల నిర్మాణం



కొత్తూరు మండలం హంస కాలనీ గ్రామంలో శివాలయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ

కొత్తూరు: రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 3079 హిందూ దేవాలయాలను రూ. 843.76 కోట్లతో నిర్మిస్తున్నట్లు దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ చెప్పారు. రాష్ట్రంలో శ్రీవాణి ట్రస్టు ద్వారా 2872 ఆలయాలను రూ.298.67 కోట్లతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు భాగస్వామ్య పద్ధతిలో ఫేజ్ 1, 2, 3లలో రాష్ట్రంలో 207 ఆలయాలను రూ. 544.89 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. కొత్తూరు మండలంలోని హంస కాలనీ, కొత్తగూడ గిరిజన గ్రామాల్లో నిర్మిస్తున్న శివాలయం, శ్రీకృష్ణదేవాయాల పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. జిల్లాలోని శ్రీవాణి, సీజీఎఫ్ కేటగిరీల కింద మొత్తం 55 ఆలయాలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఎస్సీ ఎస్టీ, బీసీ ప్రాంతాల్లో హిందూ సంప్రదాయాలను మరింత పెంపొందించేందుకు గాను దేవ దాయ శాఖ ద్వా రా ఆలయాలు నిర్మిస్తున్నట్లు వివరించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ప్రజల భాగస్వామ్యంతో నిర్మించే ఆలయాలకు 20 శాతం ప్రజలు, 80 శాతం దేవదాయ శాఖ చెల్లిస్తుందని తెలిపారు. గోదావరి జిల్లాలో అయితే 30-70 ఉంటుందన్నారు. ఆలయాల నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు, హంస శివాలయం కమిటీ సభ్యులు బి.వెంకటరావు, పొగిరి రవి, గోపాలరావు, మల్లేశ్వరరావు, అరసవిల్లి సూర్యనారాయణ ఆలయం ఈఓ సూర్యప్రకాష్, ఈఈ చలమల శెట్టి వెంకటరమణ, టీటీడీ నిర్మాణాల పనులు ఈఈ వీఎస్ కృష్ణ పాల్గొన్నారు. శుక్రవారం ఒక్క రోజే 30 ఆలయాలకు సంబంధించిన బిల్లులు చెల్లించినట్లు ఈఈ తెలిపారు.

చదువుతోనే భవిష్యత్‌కు సార్థకత



పెద్దకొజ్జిరియాలో క్విజ్ పోటీల స్క్రీనింగ్ టెస్ట్ పేపర్లను ఆవిష్కరిస్తున్న ఐఏఎస్ అధికారి రోణంకి గోపాలకృష్ణ

కంచిలి: చదువుతోనే విద్యార్థుల భవిష్యత్‌కు సార్థకత లభిస్తుందని డిప్యూటీ కలెక్టర్ ఐఏఎస్ అధికారి రోణంకి గోపాలకృష్ణ అన్నారు. మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలను ఆయన చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్క్రీనింగ్ టెస్ట్ పేపర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ క్విజ్ పోటీల్లో జిల్లావ్యాప్తంగా 65 జట్లు పాల్గొన్నారు. ఇక్కడ స్క్రీనింగ్ టెస్ట్‌లో ఎంపికైన పది జట్లకు, క్విజ్ పోటీలను మధ్యాహ్న భోజన కార్యక్రమం అనంతరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 కె.చిట్టిబాబు, స్థానిక సర్పంచ్ పొందల ఢిల్లీరావు, ఉపాధ్యాయులు బాలక ప్రసాదరావు, బుడ్డెపు కామేష్‌రెడ్డి, రిటైర్డ్ పోస్టుమాస్టర్ లోళ్ల శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి క్విజ్ విజేతగా పూండి జట్టు, ద్వితీయ స్థానంలో కవిటి, తృతీయ స్థానంలో లింబుగాం జట్టు నిలిచాయని నిర్వాహకులు వెల్లడించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రమాద స్థలంలో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం జాతీయ రహదారిపై వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. మండలంలోని పైడిభీమవరంలో గల సాహు దాబా ఎదురుగా జాతీయ రహదారిపై గురువారం రాత్రి 11.45 గంటల సమయంలో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. వయస్సు సుమారు 30-40 మధ్య ఉంటుందని, వివరాలు తెలిసిన వారు జే.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు. ఈ ప్రమాదంపై జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.